క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు పెద్దరాజు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో డిజిటల్ బోర్డుల ఏర్పాటు



డిజిటల్ బోర్డుపై రాస్తున్న ఉపాధ్యాయుడు బెండి ప్రసాద్

సీతమ్మధార: నూతన విద్యా విధానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లిప్ బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో 20 డిజిటల్ ఫ్లిప్ బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామ్‌సంగ్(సర్వీసింగ్) కంపెనీ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ విశాఖ అర్బన్ ప్రభుత్వ పాఠశాలల్లో 160 బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో 20 బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా డిజిటల్ బోర్డుపై విద్యా బోధన సులువుగా ఉంటుందని చెప్పారు. ఈ బోర్డుల ద్వారా ప్రాక్టికల్‌గా గుర్తుంటుందని, విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందని, టెక్నికల్‌గా ఉపయోగపడుతుందని హెచ్‌ఎం రాంప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బెండి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: రౌడీ షీటర్లు అల్లర్లు సృష్టిస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని ద్వారకా జోన్ సీఐ సీహెచ్.సింహాద్రినాయుడు హెచ్చరించారు. ద్వారకా పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు రాత్రి తొమ్మిది గంటలకు ఇంటి వద్ద ఉండాలని, మద్యం తాగి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కడ పనిచేస్తున్నది వివరాలు తెలియపరచాలని చెప్పారు. కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

వాకర్ ఆకస్మిక మృతి



మృతి చెందిన బీఎస్ఎన్ రెడ్డి

మురళీనగర్: మురళీనగర్‌లో ఒక వాకర్ వాకింగ్ చేస్తుండగా ఆకస్మికంగా మృతి చెందారు. వివరాలిలా.. ఈ ప్రాంతానికి చెందిన బీఎస్ఎన్ రెడ్డి (75) ప్రతి రోజు లాగానే ఆదివారం ఉదయం 5 గంటలకు వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్‌కు వచ్చారు. ఆయన వాకింగ్ ట్రాక్‌పై ఒక రౌండ్ నడిచిన తర్వాత కాసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంటుండగా కుప్పకూలిపోయారు. వాకర్స్ వచ్చి ఆయనకు సపర్యలు చేసి 108కు ఫోన్ చేసినప్పటికి అప్పటికే రెడ్డి మృతి చెందినట్లు గుర్తించారు. అతని మృత దేహాన్ని స్వగృహానికి తరలించారు. గుండె పోటుతో ఆయన మృతి చెంది ఉంటారని భావిస్తున్నారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కు జీవిత కాలం సభ్యుడిగా బీఎస్ఎన్ రెడ్డి ఉన్నారు. ఆయన మరణంతో ఆదివారం పార్కును మూసివేశారు. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వర ప్రసాద్, సి.నాగ రాజు, కోశాధికారి మళ్ల రామకృష్ణ సంతాపం ప్రకటించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో సీఐ రంగనాథం, ఎంఈవో ప్పలరాజు

సింహాచలం: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం అన్నారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న పి.వి.నరసింహం మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, ప్రతీ విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. సింహాచలం దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు గొడవర్తి గోపాలకృష్ణమాచార్యులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికి సరస్వతీ కటాక్షం ఉండాలని ఆశీర్వదించారు. సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు చేశారు. పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్రప్రసాద్, కార్మిక నేత సీహెచ్.సూర్యనారాయణరాజు, రాజనాల సత్యారావు, అడ్వకేట్ కె.రామకృష్ణ, గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న దేవస్థానం రిటైర్డ్ ప్రధాన అర్చకుడు గోపాలకృష్ణమాచార్యులు

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో గత నెల 11వ తేదీ నుంచి ప్రారంభమైన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సీఐ రంగనాథం మాట్లాడుతూ సువిశాల ప్రపంచంలో మనకు ప్రతి రోజు పలు సమస్యలు ఎదురవుతూనే ఉంటాయన్నారు. వాటిని ఏవిధంగా అధిగమించవచ్చో తెలుసుకోవాలంటే పాఠకుడు నిత్యం విద్యార్థిగా ఉండాలన్నారు. అందుకు గ్రంథాలయాలు ఎంతో దోహదపడతాయని ఆయన వివరించారు. ఎంఈవో ఎస్.అప్పలరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలన్నారు. ఎంత నేర్చుకున్నా మరింత నేర్చుకోవాల్సింది ఉంటుందని చెప్పారు. స్థానిక పురోహితుడు స్వయంపాకల చంటి తన కుమారుడి జ్ఞాపకార్థం వేసవి విజ్ఞాన శిబిరంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి. శిరీష, వంగలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. పాణి తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం నేడు



నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7.25 గంటలకు హనుమాన్ ఉపాసకులు బ్రహ్మశ్రీ పెంట రమేష్ కుమార్ శర్మ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తారని కమిటీ ప్రతినిధులు చెప్పారు. ఉదయం నుంచి ఆలయంలో మండప పూజలు, యంత్రశుద్ధి, వేదపారాయణం వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముఖ్యఅతిథులుగా బ్రహ్మశ్రీ సుందర కాళేశ్వర శర్మ, బ్రహ్మశ్రీ దార్లపూడి వెంకటసీతారామశర్మ, బ్రహ్మశ్రీ భోగాపురపు బలరామకృష్ణ శాస్త్రి, బ్రహ్మశ్రీ జాడ హరీష్‌శర్మ, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం సర్పంచులు కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, సీహెచ్.సుజాత ముత్యాలు పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

గుర్తుకొస్తున్నాయి

20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత ఆదివారం కలిశారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అరేయ్.. ఒరే అని పిలుచుకుని విద్యార్థుల్లా మారిపోయారు. ఆనాటి మధుర స్మృతులను,చిలిపి తగాదాలు, జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. తమ కుటుంబాల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2000–2002 విద్యా సంవత్సరం మధ్య ఇంటర్ చదువుకున్న విద్యార్థులంతా కళాశాల ఆవరణలో కలుసుకుని ఆట పాటలతో అలరించి సందడి చేశారు. పూర్వ విద్యార్థులు విశ్వనాథ్,రాజేష్,కిశోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఆందోళన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు

పరవాడ: బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తూ సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ సినిమాహాలు కూడలిలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని గనిశెట్టి దుయ్యబట్టారు. 60 మంది బలిదానంతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూడడం దుర్మార్గమన్నారు. అమిత్ షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాయుడు, బి.అప్పారావు, జి.అప్పారావు, సీహెచ్.నాయుడు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్‌కు అనాథ మహిళ తరలింపు



మహిళను నైట్ షెల్టర్‌కు తరలిస్తున్న అధికారులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో సంచరిస్తున్న అనాథ మహిళను నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నీల రెడ్డి ఇచ్చిన సమాచారంతో టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నైట్ షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి వెంటనే స్పందించారు. అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. అనాథలు, బిచ్చగాళ్లు ఎవరైనా రోడ్లపై కనిపిస్తే 77939 77705 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమిస్తే వారిని నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పిస్తామని జ్యోతిర్మయి తెలిపారు.

ఆ పార్టీల వైఖరి స్పష్టం చేయాలి

- ‘ఉక్కు’ ప్రైవేటీకరణ ఉద్యమంలో అందరూ ఐక్యమవ్వాలి
- ఉక్కు పోరాట కమిటీ నేతల డిమాండ్



850వ రోజు ఉక్కుదీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చి 850 రోజులు గడుస్తున్న రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల్లో ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేదని, కేంద్ర హోంమంత్రి అమిషా విశాఖ పర్యటన సందర్భంగానైనా అధికార, విపక్షాలు పార్టీలు ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా తమ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 850వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో స్టీల్ ప్లాంట్‌లోని వివిధ విభాగాల కార్మికులు, భూనిర్వాసితులు, వారి కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా వేల కోట్లు టర్నోవర్ చేసిన విశాఖ ఉక్కు పరిశ్రమకు ఈ ఏడాది ముడి సరుకు అందించకుండా నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. తెలుగు ప్రజల బలమైన ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించే విధంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కరుణించమ్మా కనకమాంబ



విద్యుత్ కాంతుల్లో త్రిశక్తి ఆలయం



సీతంపేట త్రిశక్తి ఆలయంలో అమ్మవారు

సీతంపేట: గ్రామ దేవతల పండగలు మన సంస్కృతిలో భాగం. గ్రామాన్ని, అక్కడి ప్రజలను గ్రామ దేవతలు కాపాడతారని భక్తుల విశ్వాసం. ప్రతి ఏటా అమ్మవార్లకు జాతర జరిపించి, గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి పసుపు, కుంకుమ, చీర, గాజులు, మొక్కులు అమ్మవారికి సమర్పించడం ఆనవాయితీ. సీతంపేటలో వందేళ్ల కిందట వెలసిన భూలోకమాత, కనకమాంబ, పైడిమాంబ ముగ్గురు అమ్మవార్లతో కొలువైన త్రిశక్తి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి ఏటా ఒక అమ్మవారి పేరున పెద్ద ఎత్తున పండగ నిర్వహిస్తుంటారు. ఈ సారి కనకమాంబ అమ్మవారి పండగ మహోత్సవానికి శ్రీకృష్ణ యువజన సంఘం ప్రతినిధులు భారీ ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం అమ్మవారి పండుగ చాటింపు చేశారు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల నుంచి పురవీధుల్లో ఉజ్జరీ బండి, సాయంత్రం 6 గంటల నుంచి తొలేళ్ల పండగకు సన్నాహాలు పూర్తి చేస్తారు. మంగళవారం కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ అంగరంగ వైభవంగా జరపడానికి సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా దాతల విరాళాలతో అమ్మవారి ఆలయాన్ని చూడముచ్చటగా ఆధునీకరించామన్నారు. గుడి లోపల గ్రానైట్ ఫ్లోరింగ్, వాల్స్, ఆలయం చుట్టూ స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిల్స్ ఏర్పాటు, ఆలయానికి రంగు రంగుల పెయింటింగ్ వేశారు.

ఊరంతా పండగ సందడి

గణేష్‌నగర్‌లో కొలువైన కనకమాంబ ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూల దండలు, వేపమండలతో ముస్తాబు చేశారు. సీతంపేటలోని ప్రతి వీధిలో విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రధాన కూడళ్లల్లో అమ్మవార్ల ఎల్ఈడీ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 13న కనకమాంబ అమ్మవారి ప్రధాన పండగ సందర్భంగా సేవా గరిడీలు, కోయ డ్యాన్సులు, ధూంధాం డ్యాన్సులు, నేల డ్యాన్సులు, తప్పిట గుళ్లు, కర్రసాము వంటి సంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యుత్ దీపాలంకరణ, బాణసంచా అనుపు మహోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అదే రోజు సాయంత్రం సీతంపేట మెయిన్ రోడ్, దుర్గాగణపతి ఆలయం వద్ద స్టేజీ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. రెండేళ్ల తర్వాత భారీగా చేస్తున్న పండగకు ఆహ్వానిస్తూ ఉత్సవ కమిటీ సీతంపేటలోని ఇంటింటికీ వెళ్లి పత్రాలు అందజేశారు.

ఘనంగా ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ 14వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ముడసర్లోవ సమీప స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద ఉన్న అసోసియేషన్ కార్యాలయాన్ని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ 11వ వార్డు నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని కేక్ కట్ చేశారు. ముందుగా ఇటీవల ఒడిశా రాష్ట్రం బాలాసోర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మృతులకు సంతాపం తెలిపారు. అనంతరం గొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. మంచినీటి సమస్య పరిష్కారానికి ఇక్కడి ఆవరణలో బోరు తీయించే ఏర్పాటు చేస్తానన్నారు. నడక ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి, పలువురు సభ్యులు మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాలుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సభ్యులు పి.శంకరరావు, వై.బాలరాజు, మధుసూదనరావు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఐక్య పోరాటాలు



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: రాజకీయ పార్టీలు, కార్మిక, ఉద్యోగ సంఘాలతో కలిసి ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్షలు 850వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో ఆదివారం ధర్నా చేశారు. ఉక్కు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకునేలా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. సేవ్ వైజాగ్ అంటూ సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో, ఇన్‌స్టా, ట్విటర్, ఫేస్‌బుక్‌లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రయివేటీకరణ కుట్రలో భాగంగా ముడి సరుకు కోసం బీఎఫ్–3లో ఉత్పత్తి పునరుద్ధరణ కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటన ప్రభుత్వ రంగ సంస్థలకు మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతోనే ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, మార్పుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, పిట్టా రెడ్డి, డీవీ రమణ, మంత్రి శంకరనారాయణ, మసేనురావు, గొందేశి రాము, మంత్రి గోపీ, కురందాసు వంశీకృష్ణ, శ్రీనివాసరావు, అప్పారావు, దొమ్మేటి అప్పారావు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వేటకు సన్నద్ధం



బోటులోకి ఉప్పు వేస్తున్న మత్స్యకారులు

రెండు నెలల విరామం తర్వాత గంగపుత్రులు వేటకు సిద్ధమవుతున్నారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు పూర్తిస్థాయిలో పడవలను, వలలను సిద్ధం చేసుకున్నారు. మత్స్యకార గ్రామాల్లో ఏటా జరిగే గ్రామ దేవతల జాతరలు కూడా పూర్తవుతుండడంతో బుధవారం నుంచి వేటకు బయల్దేరుతున్నారు. ఫిషింగ్ హార్బర్‌లో సందడి వాతావరణం నెలకుంది. మరబోట్లు వేటకు సిద్ధమవుతున్నాయి. వేటకు అవసరమైన సరకులు సిద్ధం చేసుకుంటున్నారు. బోట్లు శుభ్రం చేసుకోవడం, నీరు నింపడం, విద్యుత్ సౌకర్యం, ఉప్పు బస్తాలు, ఐస్ నిల్వ చేసుకుంటున్నారు.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



బోటుపై ఏర్పాటు చేసిన వలలు



ఉప్పు బస్తా తీసుకువెళ్తున్న మత్స్యకారులు

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ముత్యాలమ్మ పండగ ప్రారంభం

నేడు తొలేళ్లు



వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ

దాబాగార్డెన్స్: స్థానిక 28, 29 వార్డుల గ్రామదేవత ముత్యాలమ్మ 23వ వార్షిక మహోత్సవం ఆదివారం నౌరోజీరోడ్డు, ఊటగెడ్డ, వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయం వద్ద ఘనంగా ప్రారంభమయింది. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ పుర వీధుల్లో చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ప్రధాన పండగ జరపనున్నారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరపనున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. ఉదయం 6, 11 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. 11.30 గంటలకు వెండి ఆభరణాలతో విశిష్ట దర్శనం కల్పించనున్నారు. భక్తులచే పసుపు కుంకుమ సమర్పించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి వంకలవీధి నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న అమ్మవారి మారువారం జరపనున్నట్టు ముత్యాలమ్మ సేవా సంఘం తెలిపింది.

ఘనంగా శిఖర ప్రతిష్టాపన మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో ఆలయ పునర్నిర్మాణం, ఆలయ శిఖర ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. వేద పండితుల ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా గణపతి పూజ, దీక్షాధారణ, వాస్తు యోగిని క్షేత్రపాలక నవగ్రహ సర్వతోభద్ర మండప పూజలు, అధివాసాలు, జలాధివాసం, క్షీరవాసం, ధాన్య, క్షయాధివాసాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ, ఆలయ సిబ్బంది, సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం జరిగే శిఖర ప్రతిష్ఠ, మధ్యాహ్నం జరిగే భారీ అన్నసమారాధన కార్యక్రమాలకు టీటీడీ చైర్మన్, రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఆలయ పునర్నిర్మాణ దాత ఆడారి ఆనంద్‌కుమార్, వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, దేవదాయ శాఖాధికారులు పాల్గొంటారని ఎర్నిమాంబ ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వెంకట సత్యసురేష్‌బాబా తెలిపారు.